క్లుప్తంగా

నేడు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే నూతనంగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించామని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఘనంగా శ్రీ ధన్వంతరి భగవాన్ జయంతి వేడుకలు

వేంపల్లె : స్థానిక శ్రీ సద్గురు త్యాగరాజుస్వామి గుడి ఆవరణలో శనివారం నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు వైద్య నారాయణ శ్రీధన్వంతరి భగవాన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘాల నాయకులు, సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆడ బిడ్డను పుట్టనిద్దాం.. రక్షిద్దాం

పులివెందుల టౌన్ : ఆడ బిడ్డను పుట్టనిద్దాం, చదివిద్దాం, గౌరవిద్దాం, రక్షిద్దామని డిప్యూటీ హెచ్ఈఓఆర్ ప్రసన్నలత తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక నగరిగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ డాక్టర్ స్నేహ ప్రత్యూష ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను ఆపుదాం, ప్రతి ఒక్కరికి మాతశిశు సంరక్షణ సేవలు అందేటట్లు చూద్దామన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ఆవశ్యకత, ఆడబిడ్డ ప్రాముఖ్యత గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ ముగ్గురాయి తవ్వకాల పరిశీలన



ముగ్గురాయి అక్రమంగా తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

పెండ్లిమర్రి : మండలంలోని నాగాయపల్లె గ్రామ సమీపంలోని తుమ్మలూరు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 874లో అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని శనివారం ఫారెస్టు ఎఫ్ఆర్ఓ సుబ్రమణ్యం పరిశీలించారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది కలిసి తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. తవ్వకాల వద్ద ఒక హిటాచి యంత్రం, టిప్పర్ ఉన్నాయి. హిటాచి యంత్రంతో తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పూడ్చి వేయించి వాటిని పంపించారు. తదుపరి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.


సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ



దుకాణం వద్ద జీఎస్టీ ఆవశ్యకత గురించి వివరిస్తున్న లయోలా కళాశాల విద్యార్థులు

పులివెందుల టౌన్ : స్థానిక పురవీధులలో శనివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై లయోలా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ వనా చిన్నప్పలు ప్రారంభించారు. ఈ ర్యాలీ కళాశాల నుంచి పట్టణ ప్రధాన కూడలి వద్ద వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు దుకాణాల వద్ద పౌరులకు సూపర్ జీఎస్టీ యొక్క అవశ్యకతను వివరించారు. కార్యక్రమం లో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు



సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు

వేంపల్లె : స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వివిధ వేషాధారణలతో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పర్యావరణాన్ని కాపాడే విధంగా దీపాల వెలుగులతో సంతోషంగా పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

కొనేవారు లేక ఉల్లి రైతు గగ్గోలు

- గిట్టుబాటు ధరకు నోచుకోని ఉల్లి ధర
- ఖర్చులు కూడా రాలేదంటున్న ఉల్లి రైతులు



ఉల్లిని కోస్తున్న వ్యవసాయ కూలీలు

మైలవరం : పండిన పంటకు ఒకవైపు గిట్టుబాటు ధరలేక పెట్టి ఖర్చులు కూడా రాలేదంటూ పంటను వదిలేయలేక రైతులు నిలువునా మునిగిపోతున్నారు. నెలల తరబడి పంట కోసం చేసిన అప్పులు గుదిబండగా మారి వాటిని తీర్చటానికి ఎమి చేయాలో అర్థంకాని పరిస్థితి ఉందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం మండలంలోని పొన్నంపల్లి, తొర్రివేముల, నార్జాంపల్లి, ఎం.కంబాదిన్నె, బెస్తవేముల, చిన్నవెంతుర్ల, నక్కోనిపల్లె, బూబుసానిపల్లె, రామచంద్రాయపల్లి, దొడియం, నవాబుపేట తదితర గ్రామాలలో 300 ఎకరాల్లో ఉల్లి పంటను రైతులు ఎక్కువగా సాగు చేశారు. అయితే పంట వేసే సమయంలో ఉన్న ధరలు ప్రస్తుత కోత సమయంలో పూర్తిగా పడిపోవడంతో రైతు ముఖాలలో నిరాశ అలుముకుంది. ఉల్లి రైతు ఎకరాకు లక్ష 20 వేల నుంచి లక్షా 50వేల వరకు పెట్టుబడులు పెట్టి పంట సాగుచేశారు. ప్రస్తుతం ఉల్లి క్వింటా ధర ఎంత అని వ్యాపారస్థులు అడిగేవారు ముందుకురావడంలేదని రైతులు బాధను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాకు 1200 రూపాయల చొప్పున మద్దతూ ధర ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఎక్కడ స్టాల్స్ కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉంది. కూలీలకు రోజుకు మూడువందల చొప్పున పెట్టి మరి పండిన పంటను కోతలు కోయిస్తున్నారు. దీనికి కూడా డబ్బులు చెల్లించాలంటూ ఉల్లి రైతులు ఆలోచనలో పడ్డారు. ఉల్లి పంటనే కొనేవారు లేకపోతే పంట కోసినందుకు కూలీ డబ్బులు ఎక్కడ నుంచి తీసుకు రావాలంటూ వాపోతున్నారు. కర్నూల్ జిల్లాలో ఉల్ల సాగు చేసి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రైతులకు హెక్టారుకు రూ.50వేలు ఇస్తుంటే కడప జిల్లాలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడంలేదు.

కొనేవారే లేరు...



మూడు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. పంట కోతకు వచ్చింది. కూలీలను పెట్టి కోత కోయిస్తాను. పైన వర్షాలు పడుతున్నాయి. వ్యాపారులు ఉల్లిని కొనటానికి రావడంలేదు. ప్రభుత్వం ఉల్లి పంటను కొనాలి.

– పవన్‌కుమార్, నవాబుపేట, మైలవరం.

జోరుగా నకిలీ మద్యం విక్రయాలు

వేంపల్లె : స్థానిక ఓ మద్యం షాపులో నకిలీ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధృవకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మాత్రం మద్యం విషయంలో నాణ్యమైన మద్యం ఇస్తున్నామంటున్నారని, ప్రభుత్వం మద్యంపై ఒక యాప్ ఇచ్చి నాణ్యమైన మద్యం ఇస్తున్నామని, చెక్ చేసుకోండి అని సవాల్ చేస్తోందన్నారు. ఆ యాప్‌లో చెక్ చేస్తే కొనే మద్యం ఒకటి, యాప్‌లో చూపెట్టేది మరొకటి ఉందన్నారు. కొన్నది మాన్సన్ హౌస్ మద్యం బాటిల్ కాగా.. యాప్‌లో ఉన్నది ఓల్డ్ అడ్మినరల్ మద్యం బాటిల్ పేరు చూపిస్తోందన్నారు. ఇదేమిటని మద్యం షాపు వారిని అడిగితే వారి దగ్గర సమాధానం లేదన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు వీటిని తనిఖీ చేసి నకిలీ మద్యం తయారీ చేసి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకుని వారి లైసెన్స్‌ను రద్దు చేయాలన్నారు. అవసరమైతే ఎక్సైజ్ శాఖ వారిని కుడా పార్టీ తరపున కలుస్తామన్నారు.

అనధికారిక లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి



మాట్లాడుతున్న కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కృష్ణసింగ్

పులివెందుల టౌన్ : గ్రామ పంచాయతీల్లో అనధికారిక లేఅవుట్లను యజమానులు క్రమబద్ధీకరించుకోవాలని, క్రమబద్ధీకరించుకొకపోతే చర్యలు తప్పవని కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కృష్ణసింగ్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాగిమానుపల్లె, ఎర్రిపల్లె, కనంపల్లె, ఎర్రబల్లె-1, 2, ఇ.కొత్తపల్లె గ్రామాల్లో అనధికార లేఅవుట్లు ఉన్నాయని, ఈనెల 24వ తేదీలోపు రూ.10వేలు చెల్లించి రెగ్యులైజ్ చేసుకోవాలన్నారు. రెగ్యులైజ్ చేసుకోకపోతే సరిహద్దు రాళ్లను తొలగించడం జరుగుతుందన్నారు. ఈ లేఅవుట్లలో స్థలాలు తీసుకున్న యజమానులు ప్రభుత్వానికి నిబంధనల మేరకు డబ్బులు చెల్లించి వాటిని ఎల్ఆర్ఎస్ స్కీమ్ కింద క్రమబద్ధీకరించుకోవాలన్నారు. అనధికారక లేఅవుట్లలో ఫ్లాట్ కొన్న ప్రతి ఒక్కరూ గవర్నమెంట్ ఇచ్చిన ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే అనధికారక లేఅవుట్లు, ఇతర విషయాలపై పంచాయతీ కార్యదర్శులతో ఆయన చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు ముగిసిన శిక్షణ తరగతులు

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులపాటు సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంచాయతీలకు సొంత నిధులను సమకూర్చుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ప్రణాళికలను సిద్ధం చేసుకుని నిధులను సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : గ్రామ పంచాయతీలలో ఆదాయ సృష్టి మార్గాలను కనుగొని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. శనివారం ఎంపీడీఓ భవనంలో గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ సహాయకులకు ఇంజనీరింగ్ సహాయకులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామ పంచాయితీలలో ఏఏ మార్గాల ద్వారా ఆదాయంను సృష్టించుకోవాలో దాన్ని శిక్షణ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రహమతుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : గ్రామస్థాయిలో సంపదను సృష్టించేందుకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమష్టిగా కృషి చేయాలని మండల అభివృద్ధి అధికారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల్లోని వనరులను సద్వినియోగంపై రెండు రోజులుగా సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి.

గ్రామీణ పశు వైద్యశాలల పరిశీలన

చింతకొమ్మదిన్నె : మండలంలోని పబ్బాపురం, మామిళ్లపల్లె, నాగిరెడ్డిపల్లెలోని గ్రామీణ పశువైద్యశాలలను శనివారం పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఏ.శ్రీనివాసులు పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధుల గురించి పశువుల యజమానులకు తెలియజేస్తూ ఉండాలని, అంటువ్యాధులు ప్రబలకుండా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పశు యజమానులకు, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలన్నారు. అలాగే పశువులకు నష్టం జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. పశువులను వానలో తడపడం చేయకూడదని, మేకలు, గొర్రెలకు గుంటలలో నీరు తాగడం వలన జబ్బులు రావడం జరుగుతుందని, అలా కాకుండా ఇంటి దగ్గరే మంచినీళ్ల మాత్రమే తాపించాలని సూచించారు. పశువైద్యశాలలోని రికార్డులను తనిఖీ చేసి, వైద్యశాలల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ వెటర్నరీ అధికారి చంద్రకిషోర్, పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు

పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు ఉంటుంది

జమ్మలమడుగు : పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పెద్దముడియం మండలానికి చెందిన కార్యకర్తలు, నాయకులతో గ్రామ, వార్డు కమిటీలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం పనిచేస్తే అధికారం వచ్చిన తర్వాత వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, విశ్వం, వెంకటసుబ్బారెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ఉల్లాసంగా క్రీడా పోటీలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 విభాగాలలో క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీలను మండల విద్యాశాఖ అధికారులు శివప్రసాద్, రామాంజనేయరెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. చిలంకూరు, పోట్లదుర్తి రాజీవనంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి అండర్-14. అండర్-17 విభాగాలలో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో 100, 200, 400, మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ అథ్లెటిక్స్‌లలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, విశ్రాంత పిజికల్ డైరెక్టర్ తిరుపాల్‌రెడ్డి, పాఠశాల పిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానానికి రావాలి

పులివెందుల రూరల్ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానానికి రావాలని సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ మురళీ తెలిపారు. శనివారం స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో సర్వజ్ఞ 2కె 25 సదస్సు నిర్వహించారు. చివరి రోజులో భాగంగా వివిధ టెక్నికల్, వర్క్‌షాపులో పాల్గొని గెలుపొందిన, పూర్వ విద్యార్థులకు ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ శేష మహేశ్వరమ్మ, అధ్యాపకులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో కన్వీనర్లు, కో ఆర్డినేటర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలిపై విద్యార్థుల సైకిళ్ల ర్యాలీ



పులివెందుల : పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, తదితరులు



సింహాద్రిపురంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమ ర్యాలీలో ఎంఈఓ, అధికారులు, విద్యార్థులు



ఎర్రగుంట్లలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంఈఓలు శివప్రసాద్, రామాంజనేయరెడ్డిలు

పులివెందుల టౌన్ : స్వచ్ఛమైన గాలి–ఆరోగ్యమైన జీవన శైలి కోసం స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని నగరిగుట్ట పట్టణ ప్రాథమిక వైద్యశాల పరిధిలో మొక్కలు నాటి పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం నివేదిత పాఠశాల విద్యార్థులచే సైకిల్ ర్యాలీతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, డిప్యూటీ హెచ్ఈఓఆర్ ప్రసన్నలత, పీహెచ్‌సీ డాక్టర్ స్నేహ ప్రత్యూష, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్స్, మెప్మా సిబ్బంది, సచివాలయాల సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : స్వచ్ఛ సమాజ సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఎంఈఓ ఖాదర్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో ఏపీ నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో అధికారులు జెడ్పీ పాఠశాల విద్యార్థులతో కలిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె సీమలు, పట్టణాలు స్వచ్ఛంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వచ్ఛత, పరిశుభ్రత మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ జయభారతి, పాఠశాల హెడ్మాస్టర్ సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పరిశుభ్రతను పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ర్యాలీని ఆ పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ-2 రామాంజనేయరెడ్డితో కలసి ప్రారంభించి మాట్లాడారు. దీపావళి సందర్భంగా గాలి కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రజలకు అవగాహన కోసం ఈ ర్యాలీని నిర్వహించామన్నారు. పరిసరాలను, పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే అంటు వ్యాధులను నివారించవచ్చు అన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ త్రివిక్రమ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండలకేంద్రంలో అధికారులు ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ ఆవరణ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. పరిశుభ్రత, వాయుకాలుష్యం, వాహన కాలుష్యాన్ని తగ్గించడం తదితర కార్యక్రమాలు ఇందులో చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధాకృష్ణాదేవి, డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, స్థానిక పంచాయతీ ఈవో లక్ష్మీనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌కు ఉత్తమ అవార్డు




మల్లేశ్వరమ్మకు ఉత్తమ అవార్డును అందిస్తున్న వైవీయూ వీసీ

వేంపల్లె : స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మల్లేశ్వరమ్మ ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డు అందుకున్నారు. శనివారం యోగి వేమన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్, రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డిల చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమెంటోలను అందించి సత్కరించారన్నారు. తమ కళాశాలకు వరుసగా మూడేళ్ల ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డులు రావడం హర్షించదగ్గ విషయమన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొండాపురం : ఏటూరు గ్రామంలో శనివారం పేకాట అడుతున్న ఐదు మందిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి రూ.2140 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ ఆర్.శివనాగిరెడ్డి తెలిపారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మెయినుద్దీన్

వేంపల్లె : విద్యార్థులు జ్వరాలు వచ్చిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాజా మెయినుద్దీన్ తెలిపారు. శనివారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఆరోగ్య కేంద్రాన్ని, ల్యాబ్ రోటరీని ఆయన సందర్శించి డైరెక్టర్ కుమారస్వామిగుప్తాను కలసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సీహెచ్‌ఓ వెంకటరత్నం, సూపర్ వైజర్ అంకయ్య, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు హసీనా, లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఎర్రగుంట్ల : దీపావళి పండుగ సందర్భంగా టాపాసుల వ్యాపారస్తులు నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. శనివారం ఎర్రగుంట్లలో ఏర్పాటు చేసిన టాపాసుల దుకాణాలను సీఐ విశ్వనాథ్‌రెడ్డి, కమిషనర్ శేషఫణి, ఎంపీడీఓ వెంకటరమణయ్యలతో పాటు కమలాపురం ఫైర్ శాఖ అధికారులు కలసి పరిశీలించి మాట్లాడారు. అధిక ధరలకు అమ్మకుండా చూడాలన్నారు.

భూసార పరీక్షలు తప్పని సరి

కమలాపురం : పంటలు సాగు చేసే రైతులందరూ భూసార పరీక్షలు తప్పని సరిగా చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి పద్మజ, కమలాపురం ఏఓ సరస్వతి తెలిపారు. శనివారం మండలంలోని కోగటం, పందిళ్లపల్లె, టి.చదిపిరాళ్ల గ్రామాలలో రైతులకు భూసార పరీక్షల ఫలితాల పత్రాలను పంపిణీ చేసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు సాగు చేసే రైతులందరూ తమ పొలాల్లోని మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు తప్పని సరిగా చేసుకోవాలన్నారు. భూసార పరీక్షల ఫలితాలను బట్టి అధికారులు సిఫారసు చేసిన మేరకే సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. తద్వారా సూక్ష్మ ధాతు లోపాలను నివారించ వచ్చన్నారు. చౌడును నివారించుటకు జిప్సంను భూమిలో వేయాలన్నారు. జిప్సంను వేయడానికి 10 రోజుల ముందు నేలను చదును చేసి చిన్న చిన్న మడులుగా చేసుకుని వర్షపు నీరు లేదా సాగు నీటి సహాయంతో ఆ మడులలో అధిక లవణాలను తొలగించాలన్నారు. ఎల్లారెడ్డిపల్లె, ఎర్రగుడిపాడు, చిన్నచెప్పలి, కమలాపురం ఆర్ఎస్‌కేలలో జిప్సం అందుబాటులో ఉందని, కావలసిన రైతులు ఆర్ఎస్‌కే సిబ్బందిని కలసి జిప్సం తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు శిల్ప, నిహారిక, సునీల్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

బీటెక్ రవి.. అబద్ధాలు మానుకో



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

– మీడియాతో వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : బీటెక్ రవి అబద్ధాలు, ప్రగల్భాలు మానుకొని పులివెందుల అభివృద్ధిపై దృష్టి పెడితే బాగుంటుందని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు హేమాద్రిరెడ్డిలు హితవు పలికారు. శనివారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వారు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మట్లాడారు.

బీటెక్ రవి నీవు ఏ స్ట్రాటజీతో వచ్చినా పులివెందుల ప్రాంత అభివృద్ధి, పులివెందుల ప్రజల అభిమానం, ఆశీస్సులే మున్సిపల్ ఎన్నికల్లో మా ప్రధాన బలం, బలగం అన్నారు. నీకు ధైర్యం ఉంటే పులివెందుల జెడ్పీ ఉపఎన్నికలో పులివెందుల మండల ప్రజా ఓట్లతో మీరు గెలిచారని కాణిపాకం వినాయకుడి మీద ప్రమాణం చేసి చెప్పగలవా అని ప్రశ్నించారు. వాపును చూసి బలుపు అనుకొని సంబరపడిపోకు.. నిజంగా నీకు ప్రజల్లో బలం ఉంటే ఎందుకు ఇతర నియోజకవర్గాల నుంచి టీడీపీ గూండాలను రౌడీలను తెచ్చుకొని అప్రజాస్వామికంగా ఎన్నికలు జరుపుకున్నారన్నారు. సామాన్య ప్రజలు సైతం నిన్ను చీదరించుకొనే స్థాయికి నువ్వు, నీ పార్టీ దిగజారిపోయిందన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులను రాష్ట్రానికి ఇచ్చిన ఘనత పులివెందుల ప్రజలది, వైఎస్ కుటుంబంపై వారికున్న అభిమానానికి ఇది నిదర్శనమన్నారు. ఇప్పటివరకు పులివెందుల అభివృద్ధి కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిలు తమ సొంత నిధులతో, ఎంపీ నిధులతో ఆగిపోయిన అభివృద్ధి కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం చిల్లి గవ్వ కూడ ఈ ప్రాంతానికి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. మా పార్టీ అంతర్గత విషయాల్లో భాగంగా సతీష్‌రెడ్డి మాట్లాడిన మాటలపై కూడా విమర్శలు చేయడం నీ దిగజారుడు తనానికి పరాకాష్ట అన్నారు. సతీష్‌రెడ్డి దగ్గర శిష్యరికం చేసి ఈ రోజు ఆయననే విమర్శించడం పిల్ల వచ్చి తల్లిని వెక్కిరించినట్లు నీ కుంచితపు బుద్ధికి నిదర్శనమన్నారు. ఎక్కడైనా ఏ చెరువుకు అయినా ప్రభుత్వం నీరు విడుదల చేస్తే ఒక వారంలోనో పదిరోజుల్లో నిండే పరిస్థితి చూసాం కానీ.. ఎర్రబల్లె చెరువుకు 40 రోజులుగా నీరు ఇస్తున్నా నిండే పరిస్థితి లేదన్నారు. మరో 40 రోజులు కావాలని మీరు చెప్పే కల్లబొల్లి మాటలతో రైతులు బేజారెత్తిపోయారన్నారు. వర్షానికి కుంటలు నిండి క్రిందకు వస్తున్న నీటిని కూడా మీరే వదిలినట్లు జబ్బలు చరచుకోవడం హాస్యాస్పదమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 18 నెలలు పూర్తి కావస్తున్నా మీ చేతకాని పాలనతో రియల్ ఎస్టేట్ ధరలు పెరిగే అవకాశం లేకుండా చేసి ఆత్మస్తుతి పరనిందలో కాలం గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నాయకుడు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ నియోజకవర్గ అధ్యక్షుడు కార్తీక్, కౌన్సిలర్లు ఖాదర్, రాజశేఖరరెడ్డి, కో ఆప్షన్ చంద్రమౌళి, లక్ష్మీనారాయణరెడ్డి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.